స్వాతంత్య్ర సంబరాలకు సర్వం సిద్ధం



హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

దాబాగార్డెన్స్: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 79 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. విద్యార్థులు ఈ వేడుకల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో జెండా పండుగ వేడుకలను పురస్కరించుకుని ఎన్‌సీసీ కేడెట్లు మార్చ్‌పాస్ట్ కోసం వారం రోజులుగా కఠినమైన తర్ఫీదు తీసుకున్నారు. ఇప్పటికే క్రీడా పోటీలు, క్విజ్, వ్యాసరచన, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించిన పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు స్వాతంత్య్ర దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.


జోరుగా విక్రయాలు

జాతీయ జెండాల అమ్మకాల జోరు

నగరంలోని పలు ప్రాంతాల్లో స్వాతంత్య్ర దినోత్సవ సందడి ముందే మొదలైంది. పూర్ణామార్కెట్, స్ప్రింగ్‌రోడ్డు, బౌడరారోడ్డు, వెలంపేట, దుర్గాలమ్మ గుడి జంక్షన్, డాబాగార్డెన్స్, మహారాణిపేట, అల్లిపురం వంటి ప్రాంతాల్లో జాతీయ జెండాల విక్రయాలు జోరందుకున్నాయి. కార్యాలయాలు, పాఠశాలలు, ఇళ్లలో ఎగురవేసే వివిధ రకాల జెండాలతో పాటు, దుస్తులపై పెట్టుకునే జెండాలు, చేతి బ్యాండ్లు, కాషాయ, తెలుపు, ఆకుపచ్చ బెలూన్‌లు, దేశభక్తి గీతాలు, చాక్లెట్లు కూడా విక్రయానికి అందుబాటులో ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాలు సందడిగా మారాయి.


జోరుగా జాతీయ జెండా విక్రయాలు


హెడ్ బ్యాండ్లు, హ్యాండ్ బ్యాండ్లు, వివిధ రకాల జెండాలు

ప్లాస్టిక్ రహిత జెండాల విక్రయాలు

ఈసారి ప్లాస్టిక్‌తో తయారు చేసిన జెండాలు, ఇతర వస్తువుల విక్రయాలను నిషేధిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. విక్రయదారులు కూడా కాగితంతో తయారు చేసిన జెండాలను మాత్రమే అమ్ముతున్నారు. ఈ చర్యలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బుధవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ, విద్యార్థులందరూ దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారులు డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్. అనురాధ, డాక్టర్ జె. లావణ్య, డాక్టర్ బి. హైమావతి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్. అనూష, ఇతర అధ్యాపకులు కలిసి 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ జెండాలను ప్రదర్శించి దేశభక్తిని చాటుకున్నారు.


అలరిస్తున్న మువ్వన్నెల జెండాలు

స్వాతంత్రోద్యమానికి బాటలు వేసిన టౌన్‌హాల్


టౌన్‌హాల్ ముఖద్వారం


టౌన్‌హాల్ బీచ్‌రోడ్డు వైపు

దాబాగార్డెన్స్: పాత నగరంలో ఉన్న చారిత్రక కట్టడం టౌన్‌హాల్. ఇది ఆంగ్లో–ఇండియన్ వాస్తుకళకు నిలువుటద్దం. నగరంలో స్వాతంత్ర్యోద్యమానికి ఇది తొలి వేదికగా నిలిచింది. టౌన్‌హాల్‌ను 1901లో బొబ్బిలి రాజైన వెంకటశ్వేతా చలపతి రంగారావు బహదూర్, విక్టోరియా రాణి వజ్రోత్సవాల సందర్భంగా నిర్మించారు. బ్రిటీష్ ప్రభుత్వం తరఫున క్యాంప్‌బెల్ 1904లో దీనిని ప్రారంభించారు.

1906: వందేమాతరం ఉద్యమం సందర్భంగా జాతీయ నేతలు బిపిన్ చంద్రపాల్, ఎన్.ఎస్. రామస్వామి టౌన్‌హాల్ వద్ద బహిరంగ సభను నిర్వహించి, స్వాతంత్ర్యోద్యమం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

1916: స్థానిక నేతలు భూపతిరాజు వెంకటపతిరాజు, ప్రభల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో టౌన్‌హాల్‌లో రాజకీయ సమావేశం జరిగింది.

1919: సత్యాగ్రహ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 6, 1919న ఉద్యమ అవసరాన్ని ప్రజలకు వివరించేందుకు మరో సమావేశం టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేశారు.

1930: ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘనకు టౌన్‌హాల్ వేదికగా నిలిచింది. మారేపల్లి రామచంద్ర కవి, దిగుమర్తి వెంకటరామస్వామి, తెన్నేటి విశ్వనాథం వంటి స్థానిక నాయకులు టౌన్‌హాల్ నుంచి సముద్ర తీరానికి వెళ్లి ఉప్పును తయారు చేయడం ద్వారా బ్రిటీష్ ప్రభుత్వాన్ని ధిక్కరించారు.

1933: మహాత్మా గాంధీ రెండో సారి విశాఖ సందర్శించినప్పుడు 1933లో టౌన్‌హాల్ వద్ద నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైంది. గాంధీజీ 1921 నుంచి 1946 మధ్య ఐదుసార్లు విశాఖను సందర్శించారు.

క్లుప్తంగా

సెయింట్ జోసెఫ్‌లో 'హ్యాండ్లూమ్ డే'


చేనేత దినోత్సవంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో ఉన్న సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ మాట్లాడుతూ మన సంస్కృతి, వస్త్ర వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ వేడుకలు చేనేత కళను ప్రోత్సహించడానికి, సంరక్షించడానికి దోహదపడతాయన్నారు. సంప్రదాయ చేనేత కళను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో 'కాస్ట్యూమ్స్ ఆఫ్ ఇండియా', 'వింటేజ్ బ్లాక్ ప్రింటింగ్', దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు


విచిత్ర వేషధారణ పోటీలో చిన్నారులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఆశీల్‌మెట్ట సమీపంలో ఉన్న ఇస్కాన్ అనుబంధ పాఠశాల 'డివైన్ టచ్'లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారుల కోసం విచిత్ర వేషధారణ పోటీలను బుధవారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నితాయ్ సేవిని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులు రాధలు, గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. అలాగే స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశభక్తిని చాటుతూ స్వాతంత్య్ర సమరయోధులు, సైనికుల వేషధారణలో కనువిందు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. ద్వారకానాథ్ చిన్నారులను ఆశీర్వదించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించారు


కరపత్రం అందిస్తున్న రాజారెడ్డి, తదితరులు

అల్లిపురం : జీవీఎంసీ 32వ వార్డు అధ్యక్షుడు పినింట్ల రాజారెడ్డి ఆధ్వర్యంలో వార్డులోని కర్బలవీధి ప్రాంతంలో బుధవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారని... ఎన్నికల తర్వాత ఆ హామీలను విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బోని దేవ, కొణతాల కృష్ణవేణి, బొడ్డేటి కిషోర్, మాడుగుల నారాయణరావు, విశ్వనాథ్, బైరెడ్డి, తాటిపూడి రవి, మురళి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆదిత్య అచీవర్స్ డే-2025'

దాబాగార్డెన్స్: నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆదిత్య విద్యాసంస్థలు ముందుంటాయని కళాశాల ఉత్తరాంధ్ర రీజినల్ మేనేజర్ పి. రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కడారి కుమార్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 5,415 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ సాధించి అద్భుతమైన ఫలితాలు సాధించినందుకు గాను గురువారం 'ఆదిత్య అచీవర్స్ డే' నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకల్లో ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు.

జాడ లేని కంది పప్పు

- బియ్యం, పంచదార మినహా ఇతర సరకులు శూన్యం
- కంది పప్పు కోసం ఎదురు చూపులు



మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా సరిగా జరగడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిరంతరం కందిపప్పు పంపిణీ జరిగేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని నెలల్లో మాత్రమే కందిపప్పు ఇచ్చిందని, అది కూడా పూర్తిగా కాకుండా అరకొరగా ఇచ్చిందని కార్డుదారులు వాపోతున్నారు. ప్రతి నెలా కందిపప్పు ఎప్పుడు ఇస్తారని రేషన్ డీలర్లను అడుగుతుండగా, సరైన సమాధానం చెప్పలేక డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు అనేక రకాల నిత్యావసరాలు ఇస్తామని హామీ ఇచ్చినా, ప్రస్తుతం కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,12,619 తెలుపు రేషన్ కార్డులు, 625 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ వంటి ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గతంలో కిలో కంది పప్పును రూ. 70 చొప్పున పంపిణీ చేసేవారని, ఆ విధానం ఇప్పుడు కనుమరుగైందని ప్రజలు చెబుతున్నారు. కందిపప్పు, రాగి పిండి, వంటనూనె వంటి నిత్యావసరాలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం అరకొర సరుకులతో సరిపెడుతున్నారని ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు.

అమెరికా సుంకాలపై కేంద్రం మౌనం సరికాదు



జగదాంబ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక, ప్రజాసంఘాలు

దాబాగార్డెన్స్: భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడాన్ని వెంటనే ఎత్తివేయాలని, ఈ విషయంలో ప్రధానమంత్రి మౌనం వీడాలని కార్మిక, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జగదాంబ జంక్షన్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు మాట్లాడుతూ, ప్రపంచంలో ఏ దేశంపై లేని విధంగా భారత్‌పై సుంకాలు విధించినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ట్రంప్‌ను స్నేహితుడని చెప్పుకునే మోదీ, ఇప్పుడు దేశాన్ని అమెరికాకు తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు. చైనా, పాకిస్తాన్‌ల కన్నా భారత్‌పై అధిక సుంకాలు విధించడం అన్యాయమని వారు పేర్కొన్నారు. ఈ సుంకాల వల్ల దేశ ఎగుమతులు తగ్గి ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తున్నందుకే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని, అయినా మోదీ ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. ఈ చర్యల వల్ల 2025–26లో అమెరికాకు భారతీయ వస్తువుల ఎగుమతులు 30 శాతం పడిపోతాయని అంచనా వేశారు. ముఖ్యంగా వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు, ఆక్వా, తోలు, రసాయనాలు వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని వివరించారు. అంతేకాకుండా ట్రంప్ విధానాల వల్ల అమెరికాలోని భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడతారని తెలిపారు. ఈ సుంకాలను వెనక్కి తీసుకునేలా భారత ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం కార్మిక, ప్రజా సంఘాలు పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేఎం శ్రీనివాస్, ఎస్కే రహ్మాన్, కనకారావు, కొండయ్య, దేవా, కె.కుమారి, యూఎస్ఎన్ రాజు, బి.జగన్, ఎం.సుబ్బారావు, పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలపై విస్తృత ప్రచారం


గ్రాండ్ బే హోటల్ ఏరియాలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో పీతల వాసు, నాయకులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనలతో పలు వార్డుల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు ఆధ్వర్యంలో బుధవారం 187 పోలింగ్ బూత్ పరిధిలోని గ్రాండ్ బే హోటల్ ఏరియా, సూర్యనగర్, గోకుల్ రోడ్డు, సెంచరీ క్లబ్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కనకల ఈశ్వర్, పార్టీ నాయకులు బెవర మహేష్, బొండాడ వెంకట్రావు, ఆరుగుల రాజ్‌కుమార్, కోటా ఆనంద్‌ప్రసాద్, పడాల సూర్యకుమార్, గొత్రిపోటి శివ, సారిపల్లి రమణేశ్వర్, కొంద్రు సతీష్, వై.రామ్ తక్షిత్, పప్పు కమల, గొలగాని మధు, నొడగల శివ తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 31వ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో 201 పోలింగ్ బూత్ పరిధిలోని చాకలిపేటలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు మోసమని, అబద్ధాలతో ప్రజలను వంచిస్తున్నారని నాయకులు వివరించారు. అధికారంలో ఉన్నా, లేకున్నా వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రేగుల నాయుడు, పెంటకోట నాగరాజు, రాము మాష్టార్, పిలకా మోహన్, కనుకులు, బాబూరావు, త్రినాథ్, అప్పారావు, శంకరరావు, దినేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


31వ వార్డు చాకలిపేటలో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న దొడ్డి బాపూ ఆనంద్, నాయకులు

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మి పూజలు బుధవారం 20వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరంతో లక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట కూడా పూజలు చేసి, వారికి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపించారు. ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ కార్యనిర్వాహణాధికారిణి కె. శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాల కోసం 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.రాజేంద్రకుమార్, ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టర్లకు ఆటల పోటీలు


క్రికెట్ పోటీలో విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: నిత్యం పని ఒత్తిడిలో ఉండే జీవీఎంసీ కాంట్రాక్టర్లు స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటవిడుపుగా క్రీడాపోటీలు నిర్వహించారు. క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్రికెట్ వంటి నాలుగు రకాల ఆటలు ఆడారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి చెస్‌లో వి. రామకృష్ణ (విన్నర్), కాళ్ల సుధాకర్ (రన్నరప్). క్యారమ్స్ (సింగిల్స్)లో యలమంచిలి రమేష్ (విన్నర్), మద్దాల రమేష్ (రన్నరప్), షటిల్ బ్యాడ్మింటన్‌లో వి. రామకృష్ణ (విన్నర్), చక్రవర్తి (రన్నరప్ , క్రికెట్లో ఎస్.వి. రామయ్య టీం (విన్నర్), గాజువాక టీం (రన్నరప్)గా నలిచాయి. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, కోశాధికారి సిరికి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

ఆకట్టుకున్న 'శారద' గాత్రకచేరి


అలరించిన శారద గాత్రకచేరి

దాబాగార్డెన్స్: నగరంలోని జిల్లా కోర్టు సమీపాన ఉన్న ఐవీఎల్ శాస్త్రీయ సంగీత సమితి కార్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం జి.శారద సుబ్రహ్మణ్యం గాత్ర కచేరి నిర్వహించారు. ఈ గాత్ర కచేరీలో త్యాగరాజ స్వామి, శ్రీకృష్ణ, ముత్తుస్వామి దీక్షితార్‌ల సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కచేరీకి వంశీకృష్ణ, రామ్‌చరణ్, వేంకటేష్ వాద్య సహకారాన్ని అందించారు.

గీతా భవన్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు


గీతా భగవానుడు

దాబాగార్డెన్స్: పాత నగరంలోని రాజప్పనాయుడు వీధిలో ఉన్న శ్రీ గీతా భవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి, 17న రుక్మిణీ కల్యాణ వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు సంస్థ ప్రతినిధి ఎం.వి. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు సామూహిక తులసీదళ అర్చన, ఉట్టి కొట్టే కార్యక్రమం, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, ఉయ్యాల ఉత్సవం, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. 17న లోక కల్యాణం, విశ్వశాంతి కోసం ఉదయం 10 గంటలకు రుక్మిణీ కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునేవారు సంస్థ కార్యదర్శి ఎం. వనజాదేవిని 7032662344 నంబరులో సంప్రదించవచ్చు.

రెడ్ బుక్ రాజ్యాంగానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- చంద్రబాబు, పవన్, లోకేష్‌లది చేతకాని పాలన
- పచ్చ పత్రికల్లో తప్పుడు రాతలు మానుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


సుధాకర్‌బాబు, కేకే రాజు, వాసుపల్లిని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దాబాగార్డెన్స్ : డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ప్రజలకు ఇచ్చిన పవిత్ర రాజ్యాంగ హక్కులను రెడ్ బుక్ రాజ్యాంగంతో కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ధ్వజమెత్తారు. ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు సారథ్యంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో వాసుపల్లి పాల్గొని సుధాకర్‌బాబును, పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజును గజమాలతో సత్కరించారు. అనంతరం వాసుపల్లి మాట్లాడారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు ఎన్నో అద్భుతమైన పథకాలు అందిస్తే, ప్రస్తుతం చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేక పచ్చ పత్రికలో తప్పుడు వార్తలు రాయించుకుంటున్నారని విరుచుకుపడ్డారు. ప్రజలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించలేని అసమర్థ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. త్వరలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ అంటే తన గుండెల్లో ఉండే దేవుడని, అటువంటి మహనీయుల ఆశయాలు అనుసరించే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ప్రజల గుండెచప్పుడు తెలిసిన జననేత జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని వాసుపల్లి తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన దాని కన్నా రెట్టింపు ఇస్తామని ఆశ చూపి, ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వానికి పాలన చేతకాలేదని ప్రజలకు అర్థమైందని, ఎస్సీ, ఎస్టీలు, అట్టడుగు ప్రజలకు అండగా ఉండే జగనన్న పాలన కోసం వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పచ్చ పత్రికలతో ఆడుతున్న డ్రామాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని కోరారు.

స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన


వందనం స్వీకరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: ఆర్మడ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో జరగనున్న 79వ స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది కవాతును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి రాక, జెండా వందనం, గౌరవ వందనం సమర్పణ వంటి కీలక అంశాలను కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన కవాతు వాహనంలో వెళ్లి ఆర్మడ్ రిజర్వ్ బలగాలు, సివిల్ పోలీసులు, హోంగార్డ్స్‌తో పాటు ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల కవాతును వీక్షించారు. వివిధ విభాగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రముఖులు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, సాధారణ ప్రజల కోసం గ్యాలరీల ఏర్పాట్లు, వారికి కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రత గురించి అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.